క్లుప్తంగా

88 శాతం పింఛన్ల పంపిణీ



కోగిరలో పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

రొద్దం: మండల వ్యాప్తంగా వైఎస్సార్ పింఛన్ కానుక 88 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ కేశవరెడ్డి శనివారం తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయ సిబ్బంది వృద్ధులకు ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. మిగిలిన పింఛన్లు ఆదివారం పంపిణీ చేస్తామన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మడకశిర: పట్టణంలో 17వవార్డు పరిధిలోని చాకలికుంటలో శనివారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను కౌన్సిలర్ సుభద్ర ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలను నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోండి



పనులపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ శ్రీకాంత్‌గౌడు

మడకశిరరూరల్: మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ శ్రీకాంత్‌గౌడు కోరారు. శనివారం ఆయన ఛత్రం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు హాజరుకావాలన్నారు. వర్షాలు పడుతుండడంతో ఎండ తీవ్రత తగ్గిపోతోందని, భూమిలో తేమ శాతం ఉందని కూలీలు పనులను ఉపయోగించుకోవాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను కల్పిస్తున్నామని తెలిపారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు

లేపాక్షి: స్థానిక ఎమ్మార్సీ భవనంలో శనివారం మండలంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భోజన నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలను అధికారులు వివరించారు. ఈసందర్భంగా వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్‌టీఎస్, ఐఈఆర్‌పీలు, ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు విద్యాశాఖ అధికారులు శనివారం శిక్షణ ఇచ్చారు. స్థాక వైకేపీ కార్యాలయంలో ఏజెన్సీ నిర్వాహకులతో వంటలు చేయించారు. ఈ సందర్భంగా నాణ్యమైన వంటలు చేసిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. మెనూ ప్రకారం భోజనం వండాలని ఎంఈఓ-2 ఆనంద్ బాబు వారికి సూచించారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపుపై సర్వే



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను చేర్పించిన ఉపాధ్యాయులు

గుడిబండ: మండల వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి 30 మంది దివ్యాంగులైన బడి ఈడు పిల్లలను గుర్తించినట్లు సహితా విద్యా ఉపాధ్యాయులు చాముండేశ్వరి, సరస్వతి శనివారం తెలిపారు. వారిలో 10 మందిని ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతిలో చేర్పించామన్నారు. మిగిలిన 20 మంది విద్యార్థులను ఎంఈఓలు గంగప్ప, రవిచంద్రకుమార్ సమక్షంలో భవిత, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించినట్లు వారు తెలిపారు.

రోగులకు సేవలందించండి

పావగడ: సీనియర్ నర్సు సర్వతమ్మ ఆరోగ్య సేవలను కొనసాగించాలని తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డా కిరణ్ కోరారు. తాలూకా లోని కోటగుడ్డ పీహెచ్‌సీలో సీనియర్ నర్సుగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సరస్వతమ్మను తోటి ఉద్యోగులు శనివారం ఘనంగా సన్మానించారు.



తిమ్మాడపల్లిలో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం





హెచ్‌డీహళ్లి, పెనుకొండలో పూజలందుకున్న ఆంజనేయుడు



సుగూరు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పఠిస్తున్న హిందూసురక్షా సమితి సభ్యులు

హనుమా.. మముగనుమా!

- వైభవంగా హనుమద్ జయంతి
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- భక్తులకు అన్నదానం చేసిన ఆలయ కమిటీలు



తిమ్మాడపల్లిలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



పులమతిలో వీరాంజనేయుడికి పూజ నిర్వహిస్తున్న అర్చకుడు



అమరాపురంలో అలంకరణలో అంజన్న



కొంకల్లులో ఆకుపూజ అందుకున్న ఆంజనేయుడు



పూజలందుకున్న బూదిలి కాడిమాను ఆంజనేయస్వామి

చిలమత్తూరు: హనుమాన్ జయంతిని శనివారం మండలవ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. కొడికొండ చెక్‌పోస్ట్ 44వ నంబరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. రామాంజనేయులు అనే భక్తుడు అన్నదానం నిర్వహించారు. తిమ్మాడపల్లిలో ఆంజనేయస్వామి ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పెద్దనపల్లి బాలచంద్రారెడ్డి, భార్గవి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.కార్యక్రమంలో శెట్టిపల్లి సర్పంచ్ చామంతి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా శనివారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. పలుచోట్ల భక్తులు అన్నదానం నిర్వహించారు.

మడకశిర: పట్టణంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మిట్టబండ ఆంజనేయస్వామి, మారుతి నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పెద్ద ఎత్తున వేడుకలను జరిపారు. ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

అమరాపురం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. అమరాపురంలోని కోటవీధి, చెరువు ఆంజనేయస్వామి, హేమావతి, నిద్రఘట్ట గ్రామాల్లో వెలసిన అంజినేయస్వామి ఆలయాల్లో భక్తులు క్షీరాభిషేకం తదితర పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

గుడిబండ: హనుమజ్జయంతిలో భాగంగా కొంకల్లులో వెలిసిన ఆంజనేయస్వామి దేవస్థానంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారిని తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా ఆంజనేయస్వామి ఆలయల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. బూదిలి గ్రామంలో కాడిమాను ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకుడు శేఖరస్వామి స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. గుమ్మయ్యగారిపల్లి సమీపంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం నిర్వహించారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాత ఊరులోని బైల ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామికి ఆకుపూజ, మహా మంగళ హారతితో పాటు సాయంత్రం శోభాయాత్ర చేపట్టారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

అగళి: హనుమద్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామి, రామాలయాలు హనుమ నామస్మరణతో మార్మోగాయి. కోడిపల్లి, హెచ్‌డీ హళ్లిలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమీటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పెనుకొండ: పట్టణంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం నుంచే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. వేలాది మంది ప్రజలు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులకు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సుగూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో

హిందూపురం: పట్టణంలోని సుగూరులోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ ఆంజనేయస్వామిని సుప్రభాత సేవా పంచామృతాభిషేకాలు చేసి విశేషంగా వెండి అభరణాలతో అలంకరించి ఆకుపూజలు, అర్చనలు ప్రత్యేకపూజలు చేపట్టారు. ఆలయ ఆవరణలో హిందూ సురక్షా సమితి సభ్యులు హనుమాన్ చాలీసా పఠించారు. తర్వాత ఆలయ ధ్వజ స్తంభం ఎదురుగా 108 కొబ్బరికాయలు కొట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక కోట ప్రాంతంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో వెండి కవచ అలంకరణలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మోడల్‌కాలనీ, కొల్లకుంట ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్ జయంతి వేడుకలు జరిగాయి.

వైభవంగా అంజన్న బ్రహ్మరథోత్సవం



చందకచెర్లులో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



ఆంజనేయస్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు



ఆంజనేయస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

మడకశిరరూరల్: చందకచెర్లు గ్రామంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామున పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. ఆనంతరం పూలతో ప్రత్యేకంగా అలంకరించి బ్రహ్మరథోత్సవంలోకి స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య రథాన్ని లాగారు. ఆ సమయంలో భక్తులు రథంపైకి బొరుగులు, పూలు, అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

రథోత్సవంలో పాల్గొన్న ఈరలక్కప్ప

ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవంలో ఎమ్మెల్యేఅభ్యర్థి ఈరలక్కప్ప, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రథోత్సవంలో పాల్గొన్నారు. ఆనంతరం ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, దివాకర్, రవి, శేషాద్రి, నాగరాజు, నాగభూషణరెడ్డి, నరేష్ రెడ్డి, రమేష్,రుద్రప్ప, గోపి,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మరోసారి సీఎం కావడం తథ్యం



ఎమ్మెల్యే తిప్పేస్వామికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మడకశిర: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని యాదవ కల్యాణ మంటపంలో ఎమ్మెల్యే పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈవిషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రజలు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆయనకు సంపూర్ణంగా మద్దతు పలికారన్నారు. భారీ మెజారీతో వైఎస్ జగన్ మరోసారి అధికారంలోకి రానున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ 2014, 2019లో మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయడానికి అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్యేగా తనకు ఐదేళ్ల పాటు నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల నుంచి ప్రజాదరణ లభించిందని ప్రజలకు తమ పార్టీపై కలిగిన విశ్వాసం ఉందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. శనివారం చందకచెర్లులో ఆయన నాయకులను కలిసి పోలింగ్ సరళి, వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా ఇంటి వద్దకే అందించారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. పేద మధ్యతరగతి వర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీకి అధికారాన్ని కట్టబెడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మంచి మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

గుడిబండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించబోతుందని ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ధీమా వ్యక్తం చేశారు. శనివారం పళారం గ్రామంలోని తన స్వగృహంలో ఆయన్ను అగళి మండలానికి చెందిన హళ్లికెర సర్పంచ్ ముద్దరాజు, దిరేగౌడుతో పాటు వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సార్వత్రిక ఎన్నికల సరళిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ మడకశిర నియోజకవర్గంలో తమకు మంచి మెజార్టీ రాబోతుందని చెప్పారు. ఈరలక్కప్పను కలిసిన వారిలో నాయకులు బోజరాజు, లింగరాజు, జానకిరామ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

గుడిబండ: ఓట్ల లెక్కింపు తర్వాత ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ మునిప్రతాప్ హెచ్చరించారు. మండలంలోని పిసిగిరి, సిసిగిరి గ్రామాల్లో శనివారం ఎస్‌ఐ సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సరైన రికార్డులు లేని 9 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, గెలిచిన అభ్యర్థులు వారి అనుచరులతో విజయోత్సవ ర్యాలీలు, డీజేలతో సంబరాలు నిర్వహించరాదన్నారు. జనం గుంపులు గుంపులుగా ఉండరాదని సూచించారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: పట్టణంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవలు మొదలుకుని అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. అనంతరం నవగ్రహారాధన, విష్ణు సహస్ర, అష్టోత్తర నామావళి పఠించారు. తర్వాత భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టు వస్త్రాలు, వడి బియ్యంతో పాటు బంగారు ఆభరణాలతో పాటు పూలతో లక్ష్మీదేవి సమేతంగా వెండి కవచంతో నరసింహస్వామిని అలంకరించి మహామంగళారతి ఇచ్చారు. స్వామివారిని కొలిచే గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ద్వారా భక్తులకు అన్నదానం చేశారు.

ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

అగళి: స్థానిక మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మహ్మద్‌జాఫర్ విద్యార్థులకు సూచించారు. 7, 8,9 తరగతుల్లో 50, 24, 17 సీట్ల ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 7వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 10న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

హిందూపురం టౌన్: సీ.చెర్లోపల్లిలోని ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ శనివారం పేర్కొన్నారు. 7వ తరగతిలో 58, 8వ తరగతిలో 21, 9వ తరగతిలో 26 ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 8వ తేదిలోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకుని 9వ తేదిన జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలన్నారు.

ఘనంగా జాబ్ అచీవర్స్ డే



విద్యార్థులను అభినందిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

హిందూపురం: పట్టణంలోని బీఐటీ(బిట్) పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఉద్యోగ సాధకుల దినోత్సవాన్ని (జాబ్ అచీవర్స్ డే)ను ఘనంగా జరుపుకున్నారు. జేసీ అభిషేక్ కుమార్ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సాహంగా, అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి నిరంతర కృషి, పరిశోధనలు అవసరమన్నారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ చంద్రమోహన్ ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు

రొళ్ల: ఓట్ల లెక్కింపు తర్వాత గ్రామాల్లో ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. బహిరంగా ప్రదేశల్లో సభలు, ర్యాలీలు, ఊరేగింపులు వంటివి చేయకూడదన్నారు. అదేవిధంగా టపాలు కాల్చుట, విక్రయించుట, డీజిల్, పెట్రోల్ క్యాన్లలో తీసుకువచ్చి విక్రయించడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. అన్ని పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

జపానంద సేవలు ప్రశంసనీయం



జపానంద స్వామిని సన్మానిస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక రామకృష్ణ సేవాశ్రమాధిపతి జపానంద స్వామిజీ సామాజిక సేవలు ప్రశంసనీయమని స్థానిక శాంతి మెడికల్ యజమాని దేవరాజు పేర్కొన్నారు. స్థానిక స్వామి వివేకానంద సంఘటిత ఆరోగ్య కేంద్రంలో శనివారం నిర్వహించిన పశుగ్రాస కేంద్రం సేవల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోనే తొలి సారిగా స్వామి జపానంద పశుగ్రాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది రైతులకు ఉచితంగా పశుగ్రాసాన్ని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లాయర్ భగవంతప్ప, సుదేశ్ కుమార్, గంగాధర నాయుడు, కెంచగాన పల్లి గోవిందప్ప, పురుషోత్తమరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ వెంకటేశ్ స్వామి జీ సేవలను కొనియాడారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీర్చండి

పావగడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీర్చాలని స్థానిక భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు రామాంజినప్ప కార్మిక శాఖ మంత్రి సంతోష్ లాడ్‌ను డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక శాఖ ఆవరణలో శనివారం నిర్వహించిన ఆందోళన లో ఆయన మాట్లాడుతూ వెంటనే ఆన్ లైన్‌లో మండలి సౌలభ్యాల అర్జీలను తీసుకోవాలని, మే 30 కి గడువు ముగిసిన విద్యాభ్యాసం అర్జీల స్వీకార గడువును ఆగస్టు 31 వరకు పెంచాలన్నారు. అలాగే విద్యా ధనాన్ని మంజూరు చేయాలన్నారు. సౌలభ్యాల సహాయ ధనాన్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి వెంటనే జమ చేయాలన్నారు. ఈ సందర్భంగా డీఓ ధర్మలత కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం పదాధికారులు మమత, వీహెచ్ రామాంజినప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో రోగాలు దూరం



మాట్లాడుతున్న డాక్టర్ స్వరూపరెడ్డి

పరిగి: పరిశుభ్రతతో మలేరియాతోపాటు అనేక రోగాలు దూరమవుతాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వరూపరెడ్డి తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. తొలుత దోమల వల్ల కలిగే వ్యాధులు, మలేరియా వ్యాప్తి నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి మాట్లాడుతూ దోమలతో విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శివన్న, సీహెచ్‌ఓ వన్నప్ప, పీహెచ్‌ఎన్ వెంకమ్మ, పర్యవేక్షకులు రవీంద్ర, పార్వతమ్మ, షిరీనా బేగం, శ్యామల, శ్రీధర్, అరుణ, షబానా తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న 'జాబిలి'



పురస్కారం అందుకుంటున్న జాబిలి చాంద్‌బాషా

పెనుకొండ: పట్టణానికి చెందిన ప్రముఖ కవి జాబిలి చాంద్‌బాషా విద్యాప్రదాత పురస్కారం అందుకున్నారు. అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ముస్లీం మైనార్టీ చైతన్య విద్యా సదస్సు హిందూపురంలోని జామియా ఈద్గా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. ఇందులో టిప్పు సుల్తాన్ జాతీయ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్‌ఖాన్ చేతుల మీదుగా జాబిలి చాంద్‌బాషా పురస్కారం అందుకున్నారు.